

ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పోస్టల్ శాఖ ఆధ్వర్యాన అందజేస్తున్న దీన్ దయాల్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి 9వ తరగతి మధ్య విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025 వార్షిక పరీక్షల్లో 60 శాతం దాటి మార్కులు వచ్చి ఉండాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ తొమ్మిదో తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని, అదే నెల 30వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. లెవల్ 1, 2 పరీక్షలు ఉంటాయని, ఎంపికైన వారికి నెలకి రూ.500 చొప్పున ఉపకార వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను స్పీడ్ పోస్టు ద్వారా విశాఖపట్నం పోస్టల్ ప్రాంతీయ కార్యాలయం, 530017 పంపాలని తెలిపారు.

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు

- తీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు
- శిక్షల శాతం పెరిగేలా దర్యాప్తు
- రాత్రి గస్తీ పటిష్టం
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, రూరల్

విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన పోలీసు అధికారులకు బదిలీతో పాటు వ్యవహార శైలి మార్చుకోకపోతే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి హెచ్చరించారు. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులపై ఫిర్యాదులు అందాయని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధ్యక్షతన అర్ధ వార్షిక నేర సమీక్ష, పలు శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసు ప్రథమ విధిగా ఉండాలని ఆదేశించారు.

జిల్లాలో నేర నియంత్రణకు పోలీసు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక, శాస్త్రీయ కోణంలో కేసుల దర్యాప్తు చేపట్టి శిక్షల శాతం పెరిగేలా కేసుల దర్యాప్తు ఉండాలని సూచించారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ మోసాలు నియంత్రణకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ, దర్యాప్తు చేపట్టాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. రాత్రి గస్తీలు పటిష్టంగా ఉండాలన్నారు.

అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి శనివారం పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలను పోలీసులతో పాటు బాలబాలికల సంరక్షణ, చైల్డ్ లైన్, రెవెన్యూ, వైద్యారోగ్య, విద్య, ఇతర శాఖల అధికారులు సందర్శించి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల అనర్థాలు, పోక్సో, శక్తి యాప్ తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు నేర ప్రవృత్తి వంటి పలు అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో చర్చించాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన అవసరమని, నిపుణులతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చట్ట పరిధిలో కేసుల దర్యాప్తు చేస్తే శిక్షలు పడతాయన్నారు. పెండిగ్ కేసులకు వీలైనంత మేరకు సిసి నంబర్లు మంజూరు చేస్తామని తెలిపారు.

నేర రహిత జిల్లాగా కృషి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేర నియంత్రణకు తీసుకున్న పటిష్ఠ చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అన్ని శాఖల సమన్వయంతో నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆర్ అండ్ బి, హై వే అథారిటీతో కలిసి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో భాగంగా ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులు ఫైరింగ్ సాధనలో పాల్గొన్నారు.
సమావేశంలో ఎఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఎస్‌బి సిఐ ఇమ్మాన్యుల్ రాజు, పలు శాఖల అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన శిక్షణ కేంద్రం పనులు పూర్తి

కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలసలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని డిఐజి గోపీనాథ్ జట్టి ఎస్‌పి మహేశ్వర రెడ్డితో కలిసి పరిశీలించారు. తరగతి, భోజనం, సాన్నపు గదులు, బ్యారక్‌లను పరిశీలించి అదనంగా చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యుత్‌రంగ ప్రైవేటీకరణకు కుట్ర

- స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం
- 28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే కుట్రలో భాగంగానే టిడిపి కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటోందన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకొచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. టైమ్ ఆఫ్ ది డే విధానం పేరుతో పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మరో రేటు, చలికాలం ఒక రేటు, వేసవికాలం ఒక రేటు ఉంటుందని తెలిపారు. ఈ విధంగా ప్రజలను అదానీ కంపెనీ దోపిడీ చేస్తుందని చెప్పారు.

హామీనిచ్చి ప్రజలకు మోసం

ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు టిడిపి కూటమి కరెంటు ఛార్జీలు పెంచబోమని, బాదుడు ఆపుతామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఖర్చులు నిమిత్తం 93 నెలల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని చెప్పారు. ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని తెలిపారు. ఇక్కడ బిజెపి, టిడిపి డబుల్ ఇంజిన్ సర్కారు స్మార్ట్ మీటర్లు పెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసి దోపిడీ చేయడానికి పూనుకుంటోందన్నారు. ప్రజల సంపదను, వనరులను, అటవీ ఖనిజాలను అదానీ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు మన రాష్ట్రానికి ఎరువుల కోత విధించడంతో, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేయించి నీళు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, ఎన్.షణ్ముఖరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన వద్దు

- జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి
- సమస్యలు ఉంటే 9121863788కు ఫిర్యాదు చేయండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎరువుల కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అవసరాలకు సరిపడా యూరియా, డిఎపి, మోనోపాస్ఫేట్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని చెప్పారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో వరి, ఇతర పంటలు కలిపి సుమారు 3,73,000 ఎకరాల్లో సాగవుతున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ 17వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని ప్రతిపాదనలు పంపగా, అదనంగా నాలుగు వేల టన్నులతో కలిపి ప్రభుత్వం 21 వేల మెట్రిక్ టన్నులను పంపిందని చెప్పారు.

రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 10,244 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 11,400 మెట్రిక్ టన్నులు అందించామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు వద్ద 218,86 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 261 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 552 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,031.86 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అదనంగా మరో 3,200 మెట్రిక్ టన్నులు వారం రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని ఆయన వెల్లడించారు.

సమస్యలు ఉంటే నేరుగా నాకే ఫోన్ చేయండి

జిల్లాలో ఎక్కడైనా ఎరువుల సమస్య తలెత్తితే 9121863788 నంబరుతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ లేదా వాట్సప్ చేయొచ్చని చెప్పారు. ఎరువుల సమస్యలపై తనకే నేరుగా ఫోన్ చేయొచ్చని చెప్పారు. యూరియా దొరకదేమోనన్న ఆందోళనతో అదనంగా కొనుగోలు చేయడం వల్ల కొరత సమస్య తలెత్తుతోందన్నారు. యూరియా బదులుగా నానో యూరియా కూడా ఉపయోగించవచ్చని చెప్పారు. యూరియా ధరతో పోలిస్తే నానో యూరియా రేటు కూడా తక్కువని తెలిపారు.

ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు

ఎరువులు పక్కదారి పట్టకుండా పలురకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గొడౌన్లు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. పిఎసిఎస్, డిసిఎంఎస్, ఆర్‌ఎస్‌కె, ఎఫ్‌పిఒల ద్వారా చేపడుతున్న ఎరువుల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు ఈ-పాస్ యంత్రాల సమస్య ఉన్నా, జిల్లాకు మరో 150 వరకు యంత్రాలు రావడంతో ప్రస్తుతం ఇబ్బందేమీ లేదన్నారు.



కాంపాక్ట్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మున్సిపాల్టీలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మున్సిపాల్టీలో రూ.45 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన కంపాక్టర్ వాహనం, రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన కంపాక్టర్ బిన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, నాయకులు మొదలవలస రమేష్, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, ఆర్‌ఐ తమ్మినేని గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్, వ్యవసాయ అధికారులతో సమీక్ష

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పిఎసిఎస్, వ్యవసాయశాఖ అధికారులతో మున్సిపాల్టీలో ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రాథమిక సహకార సంఘాల్లో రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రైతులకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎరువులు కొరత ఉన్నట్లు వ్యవసాయ అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా, ఫోన్‌లో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో మాట్లాడి నియోజకవర్గానికి అదనపు ఎరువులను కేటాయించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా అవగాహనా కార్యక్రమాలు
- లింగ నిర్ధారణ చేసే ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో మాతాశిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇటీవల మాకివలస, గుత్తావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మాతృ మరణాలతో పాటు చొర్లంగి, గోవిందపురం, నిమ్మాడ, బైదిలాపురం కేంద్రాల్లో చోటుచేసుకున్న శిశు మరణాలపై ఎండిఎస్‌ఆర్, సిడిఎస్‌ఆర్ కమిటీలతో సమీక్షించారు. ఈ మరణాలకు దారితీసిన ప్రాథమిక వైద్య కారణాలపై కూలంకషంగా చర్చించారు. ఇకపై క్షేత్రస్థాయిలోనే మెరుగైన వైద్యం తప్పనిసరిగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు మొదటి త్రైమాసికం నుంచే హిమోగ్లోబిన్, బిపి, ఇతర ఆరోగ్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ సూచించారు. స్కాన్ల రిపోర్టులను జనరల్ ఫిజీషియన్ల వద్ద చూపించి, ప్రమాద సంకేతాలు కనిపించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భ్రూణహత్యలు జరగకుండా కఠిన పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండి గర్భిణులు, శిశువులకు ఉత్తమ సేవలందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత, డిపిహెచ్‌ఎన్ శైలజ, డిఐఒ రామదాస్, డెమో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామాన్యుడి నుంచి సామాజికవేత్తగా...

ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సూర శ్రీను సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కరోనా రక్కసి కరాళనృత్యమాడుతున్న వేళ లాక్‌డౌన్‌తో పనుల్లేక అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేదల కుటుంబాలకు, పలు రంగాల కార్మికులు, కళాకారులకు నిత్యావసర సరుకులు అందజేసి వారి పాలిట ఆపద్బాంధవుడయ్యాడు. అక్కడితో ఆగకుండా 2021లో ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు స్థాపించి దాని ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మానవత్వం, దాతృత్వం, సేవాతత్వం కలిగిన ఆయన సామాన్యుడి నుంచి సేవకునిగా ప్రజల మనసుల్లో నిలిచాడు. తాను చేసిన సేవలకు గానూ డాక్టరేట్ పట్టానూ అందుకున్నారు. ఆయనే సూర శ్రీనివాసరావు.

ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో వైకుంఠమ్మ, గన్నయ్య దంపతులకు 1984 ఆగస్టు 23న శ్రీనివాసరావు జన్మించారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన డిగ్రీ అనంతరం ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరాల్లో వ్యాపార రంగంలో అంచెలంచెలుగా పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఒకవైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. రెండు రంగాల్లోనూ ఈయనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నారు. పారిశ్రామికవేత్తగా క్రమ క్రమంగా ఎదుగుతూ తాను సంపాదించిన డబ్బు జనానికి కూడా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో సామాజికవేత్తగా మారారు. దశాబ్దకాలంగా జిల్లాలో ఎన్నో ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణంలోనూ ప్రముఖ పాత్ర పోషించారు. ఇక కోవిడ్ సమయంలో ఆయన చేసిన సేవల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మూడు విడతల కోవిడ్ సమయంలోనూ బాధిత జనానికి బాసటగా నిలిచారు. వందలాది కుటుంబాల ఆకలి తీర్చారు. 41 రోజుల పాటు కోవిడ్ బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం సరఫరా చేశారు. ఏటా పరీక్షల సమయంలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు. పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, పౌర సంఘాల నుంచి మన్ననలు అందుకున్నారు. ప్రముఖ సంస్థల నుంచి సూర శ్రీనివాసరావు అందుకున్న అవార్డులు, సన్మానాల సంఖ్య తక్కువేమీ కాదు. ఆయన సేవా కార్యక్రమాల వెనుక ఆయన భార్య సరితారాణి పాత్ర కీలకం. వారికి జ్యోతిప్రియ, జస్మిత ఇద్దరు కుమార్తెలు. శ్రీనివాసరావు పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరం, వస్త్ర దానం, పుస్తకాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ కార్యక్రమాలను ఎస్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా చేపడుతున్నారు.



అన్నదాన కార్యక్రమంలో శ్రీను, సరితారాణి (ఫైల్)



శ్రీనివాసరావుని సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)



సిఎం చంద్రబాబునాయుడుకి చెక్కును అందజేస్తున్న సూర శ్రీను (ఫైల్)

మరిన్ని వార్తలు
epaper.
prajasakti.com

25న జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలను నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు, బాలికల విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 1, 2009 డిసెంబరు 31, 2012 మధ్య జన్మించిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకి చెందిన బాలబాలికలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపుకార్డు తప్పనిసరి అని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఫెన్సింగ్ క్రీడాకారులను ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, వెస్ట్ బెర్రి స్కూల్ వద్ద నిర్వహించే 11వ ఎపి స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాలురు, బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26కి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకి 7660874844 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఎస్‌సి యువతకు హెవీ వాహన డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల యువతీ యువకులకు భారీ వాహన డ్రైవింగ్ శిక్షణ కల్పించనున్నారు. ప్రధాని ఆదర్శ గ్రామ యోజన (పిఎంఎజెవై) కింద ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. ఇందుకోసం జిల్లాకు చెందిన 10 మంది అభ్యర్థులను (పురుషులు 5, మహిళలు 5) ఎంపిక చేయాలని నిర్ణయించింది. అభ్యర్థులు తప్పనిసరిగా జిల్లాకు చెందినవారై కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. కనీసం ఒక ఏడాది లైట్ వాహన (ఎల్‌ఎంవి) డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వయసు 20 ఏళ్లు పైబడి ఉండాలి. 40 ఏళ్లు పైబడిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలి. హెవీ వాహన (హెచ్‌ఎంవి) లెర్నింగ్ లైసెన్స్ పొందేందుకు రూ.210, డ్రైవింగ్ లైసెన్స్ కోసం రూ.1,060 రుసుము అభ్యర్థులు భరించాలి. దరఖాస్తులను ఈనెల 27వ తేదీ వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో సమర్పించవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.



బస్సుల కోసం వేచిచూస్తున్న మహిళలు

బస్సు కోసం మహిళల పాట్లు

ప్రజాశక్తి- కొత్తూరు

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం ఈనెల 15 నుంచి కల్పించడంతో మహిళలు చిన్న పనికి, పెద్ద పనికి బస్సు ఆధారంతో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లడంతో పెద్దఎత్తున ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు మహిళలు చేరుకుంటున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో బత్తిలిలో ఉన్న సంతోషిమాత ఆలయానికి వెళ్లేందుకు మండలంతో పాటు ఇతర మండలాల నుంచి పెద్దఎత్తున మహిళలు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకొని బత్తిలి వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురుచూడగా శ్రీకాకుళం నుంచి బత్తిలి వెళ్లే ఆర్‌టిసి బస్సులు అప్పటికే బస్సులు కిక్కిరిసి ఉండడంతో మహిళలు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో పాటు ప్రయాణికులు బస్సులు నిండుగా ఉండడంతో ఎక్కేందుకు వీలు లేకపోవడంతో ఆటోల ద్వారా ప్రయాణమయ్యారు. బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఆర్‌టిసి అధికారులను కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి- పోలాకి

పిహెచ్‌సికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు ఎక్కువగా పేదవారే వస్తారని, వారికి ఏ విధమైన ఆరోగ్య సమస్యలున్నా వైద్యులు వెంటనే తగు చికిత్స చేయాలన్నారు. ఆస్పత్రుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయన్నారు. స్థానిక ఆస్పత్రి పరిధిలో మీటింగ్‌హాల్ కావాలని ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వీలైనంత త్వరగా మంజూరుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శ్రీనాథ్, స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.ప్రకాష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ బైరి భాస్కరరావు, పోలాకి టిడిపి మండల అధ్యక్షులు మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కవిటి

ఎప్పటినుంచో కాలయాపన చేస్తున్న పిఆర్‌సి కమిషన్ తక్షణమే ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. కవిటి ఎంఆర్‌సి ఆవరణలో శుక్రవారం యుటిఎఫ్ మండల సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు జానకిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. వెంటనే పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుత పరీక్ష విధానంలో లోపాలు ఉన్నాయని, విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా మార్పులు తీసుకురావాలని కోరారు. అనంతరం మండల ఎంఇఒ ధనుంజయ మజ్జికి వినతి పత్రం అందించారు. సమావేశంలో సూర్యం, సందీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. రెండవ వార్డు నెమలి నారాయణవురంలో రూ.2 లక్షలతో కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయంలో నాలుగేళ్లలో మున్సిపాలిటీలోని అన్ని వార్డులను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మరిన్నో అభివృద్ధి పనులు చేపడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, కొరికాన శంకర్, అంబటి కృష్ణమూర్తి, సాసుమాన చంద్ర మౌళి, యవ్వారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పెంచాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీకి పారిశుధ్య కార్మికులను పెంచాలని, ప్రస్తుతం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు జిల్లా కలెక్టర్‌కి, జిల్లా పంచాయతీ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జె.ఆర్.పురం పంచాయతీ 16వ నంబర్ జాతీయ రహదారి కావడం, అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని, పట్టణాల్లో జరుగుతున్న వ్యాపారం జరగడంతో చాలా షాపులు పెరిగాయని, జె.ఆర్.పురం పంచాయతీలో 14 వార్డులు ఉన్నాయని కాలనీలు, ఇళ్లు విపరీతంగా పెరగడంతో ప్రస్తుతం పంచాయతీలో కేవలం ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులు మాత్రమే పనిచేస్తున్నామని, ప్రతిరోజు రోడ్లు ఉడ్చుకుంటూ ఉడ్చిన చెత్త ట్రాక్టర్‌కు ఎత్తడం, మరలా డంపింగ్ యార్డ్ వద్ద కూడా పనులు నిర్వహిస్తున్నామని వాపోతున్నారు. అదనంగా మరొక ఆరుగురిని నియమిస్తే ఉన్నవారికి పని భారం తగ్గి చెత్త సేకరణ సజావుగా సాగుతుందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి



కొత్తూరు : మాట్లాడుతున్న డిఇఇ మోహనరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

గత ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న లబ్దిదారులు లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. శుక్రవారం నరసన్నపేటలో జమ్ము పంచాయతీలో జగనన్న లేఅవుట్‌ను ప్రత్యేక అధికారి, సిఇఒ శ్రీధర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లేఅవుట్‌లో ఉన్న పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నివాసం ఉంటున్న మహిళలు వచ్చి లేఅవుట్‌లో మూడేళ్ల నుంచి నివాసం ఉంటున్నా మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధిలైట్లు, శ్మశాన వాటిక లేదని, రాత్రయితే పాముల బెడద ఎక్కువగా ఉందని సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే లైట్లు వేయించాలని ఎంపిడిఒకు ఆదేశించారు. మిగిలిన సమస్యలు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా పరిష్కరిస్తామన్నారు. అనంతరం కోమర్తి పంచాయతీ పరిశీలించారు. ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్, గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొత్తూరు: మండలంలోని ఎన్‌టిఆర్ పథకం పిఎం జన్‌మన్, పిఎంఎవై 2021, 2022కు సంబంధించిన ఇళ్ల పనులను వేగవంతం చేయాలని డిఇఇ ఎం.మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఎఇ బసవ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎఇ కె.మాధవ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ దేవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ ఎం.రామారావు అన్నారు. పురపాలక సంఘంకు సంబంధించి కోసంగిపురం వద్ద గల



నరసన్నపేట : లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీధర్ రాజు

రామకృష్ణాపురం లే-అవుట్‌లో మన ఇల్లు మన గౌరవం ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్‌లో భాగంగా మంజూరైన 1966 మంది లబ్ధిదారులకు 600 మంది ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేశారని మిగిలిన వారు తొందరలో పూర్తి చేయాలన్నారు. రామకృష్ణాపురం లేఔట్‌లో గల ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీలో కమిషనర్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించి ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంజూరైన 1966 ఇళ్లకు 600 ఇళు పూర్తయ్యాయని, 860 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు వచ్చి ఆగిపోయాయని, 506 మంది ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టలేదన్నారు. ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిన అదనపు ఆర్థికసాయంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లేఅవుట్‌లో ప్రభుత్వం ఇప్పటికే మౌలిక వసతులు కల్పించిందన్నారు.



డాక్టరేట్ ప్రధానం చేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు


అన్వేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రముఖ వ్యాపార వేత్త, వైసిపి రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ప్రత్తి అన్వేష్ చేసిన అనేకమైన సామాజిక, సాంఘిక సేవలను గుర్తించి శ్రీకాకుళం జిల్లా పాస్టర్స్ క్రిష్టియన్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, 'గ్లోబల్ ఇండిపెండెంట్ క్రిష్టియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో (హానరరీ డాక్టరేట్)తో గౌరవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు అన్వేష్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలపై అభినందించారు. బిషప్ గంజి ఎజ్రా, బిషప్ కొత్తపల్లి అబ్రహాం, బిషప్ జాషువా, బిషప్ కిరణ్, బిషప్ ఏసుపాదం, బిషప్ ఫిటర్, డా దానియేలు పాల్ చేతులమీదుగా సత్కరించారు.

వికలాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి- రణస్థలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వికలాంగుల పింఛన్లు తొలగింపు అన్యాయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్హులు గా ఉన్న వికలాంగుల పింఛనుదారులకు అనర్హులుగా నోటీసులు ఇవ్వడం నీచమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాదిన్నర గడుస్తున్నా ఎంతో మంది 60 ఏళ్లు నిండిన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, కనీసం వితంతు పింఛన్లు కూడా జారీ చేయడం లేదని మండిపడ్డారు. నోటిసులు జారీ చేసిన అధికారులు వికలాంగులను అర్హులుగా గుర్తించి వారికి బాసటగా నిలవాలన్నారు. లేని పక్షంలో వికలాంగుల తరుపున వైసిపి పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మరింత బాధ్యతగా పనిచేస్తా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మరింత బాధ్యతగా పనిచేసి పార్టీ బలోపేతం చేస్తానని పాతపట్నం ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రైతుకు అందుబాటులో ఉంటానని, మండలంతో పాటు క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ పదవికి తనను ఎంపిక చేసి మరింత బాధ్యతను పెంచారన్నారు. ఈ సందర్భంగా పదవి ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుక్క బాలరాజు, నక్క గోపమ్మ, సన్నోరాథో, చిన్నికృష్ణ, పత్రి మణికంఠ, జానం ఢిల్లీ, చరణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- పలాస

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజిన్ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.బాబుజీ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలంలో సాధారణంగా ఎదురయ్యే వ్యాధులు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, నీల విరోచనాలపై వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, కాచి వడపోసిన నీటిని సేవించటం, పోషకాహారాన్ని తీసుకోవడం వంటివి వ్యాధుల నివారణకు కీలకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.మధు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి. వెంకట రమణ, సైన్స్ విభాగాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, లైబ్రేరియన్ బి.నరసింహులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా విద్యా బోధన

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులు చదువుపై ఆసక్తి పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ యు.శాంతారావు సూచించారు. శుక్రవారం కోమర్తి ఎంపిపి స్కూల్, నరసన్నపేట హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అదే విధంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈయనతో ఎంఇఒ-2 దాలినాయుడు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా ధర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువులు సమస్యలపై తమ ఫిర్యాదులను ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాధర్బార్‌లో ఎక్కువ శాతం వికలాంగుల పింఛన్లు రద్దు, రైతులకు ఎరువుల సమస్య వంటి ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



శ్రీకాకుళం సిటీ : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం సిటీ: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ కాలనీ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండల ప్రజలు, వికలాంగులు సమస్యలను విన్నవించుకున్నారు.



జెన్‌కో ఎండితో మాట్లాడుతున్న తులసీ వరప్రసాదరావు

జెన్‌కో ఎమ్‌డిని కలిసిన లోతుగెడ్డ

ప్రజాశక్తి- కొత్తూరు

ఎపి జెన్‌కో ఎండి చక్రధరరావును శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆవరణలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో వంశధార నిర్వాసితులకు సంబంధించిన యూత్ ప్యాకేజీలో అవకతవకలు విషయమై అప్పట్లో కేసు నమోదు చేయగా దానికి సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు స్థాపించడానికి కృషి చేయాలన్నారు. 32 వేల కోట్ల ప్రాజెక్టుకు అవసరమైన 2 వేల ఎకరాలు చూపిస్తామన్నారు. యువతకి ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని మాసింగిలో 2023లో శంకుస్థాపన చేసిన ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ 132/33 కెవి నేటికీ పూర్తి కాలేదన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎండి సానుకూలంగా స్పందించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. రుణాల్లో 30 శాతం వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకొని, 70 శాతం వ్యాపారాలకు ఉపయోగించాలని చెప్పారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 48 సంఘాలకు రుణాలు అందజేశామన్నారు. మహిళలు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ పంటరుణాలకు భీమా నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

సామాన్యులకు ఆధునిక సాంకేతిక సేవలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇండియన్ బ్యాంకు ఏర్పడి 118 సంవత్సరాలు పూర్తిచేసి 119 సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా ఖాతాదారుల మహోత్సవం స్థానిక పాత బస్టాండ్‌శాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్య చంద్రరావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు బ్యాంకింగ్ రంగంలో ఆధునిక సాంకేతిక సేవలు సామాన్యులకు అందుబాటులో విస్తరించడం ముదావహం అన్నారు. గౌరవ అతిథి పొట్నూరు నాగేశ్వరరావు ఇండియన్ బ్యాంక్ సేవలను అభినందించారు. శాఖాధికారి మూల నారాయణరావు మాట్లాడుతూ పాత బస్టాండ్ శాఖ సుమారు రూ.86 కోట్ల లావాదేవీలతో అందరికి అందుబాటులో సేవలు విస్తరిస్తుందని, వయోవృద్ధులకు 'డోర్ స్టెప్ బ్యాంకింగ్' సదుపాయం కల్పించామని, అన్ని రకాల సేవింగ్స్ ఖాతాలో కనీసం నిల్వలు లేకున్నా అదనపు రుసుం వసులు చేయకుండా సదుపాయం కల్పించామని, ఈ సౌకర్యం సద్వినియోగం చేసుకొని బ్యాంక్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపశాఖాధికారి రవళి, లోన్స్ ఆఫీసర్ స్రవంతి, కస్టమర్ సర్వీస్ అసోసియేట్ తిరుపతిరావు, సీనియర్ కస్టమర్ సర్వీస్ అసోసియేట్ శ్రీనివాసరావు, ఖాతాదారులు గణేశ్వరరావు, గోపి, విశ్రాంత అధికారి నాగేశ్వరావు, తిరుపతిరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ఎమ్మెల్యేపై ప్రిన్సిపాల్ నిరాధార ఆరోపణలు

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై లోలుగు మాజీ ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు నిరాధారమైనవని రాష్ట్ర మాల కార్పోరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ సౌమ్యపై విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే రవికుమార్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎపిసి దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ మేరకు ఎపిసి విచారణ చేసి ఆమెపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా బదిలీ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు సాకేటి నాగరాజు, టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కిమిలి రాజేష్, దళిత నాయకులు దోరడ్ల రాము, చందక ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత బహుళ పంట విధానం మేలు



సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రకృతి వ్యవసాయ విధానంలో సమీకృత బహుళ పంటల విధానం రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ తెలిపారు. మండలం ఎర్రాగులపేటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అమలు చేస్తున్న సమీకృత బహుళ పంటల విధానాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటకు అనుబంధంగా గట్లపై కాయగూరలు, ఆకుకూరలు వంటి పంటలను పండించడం ద్వారా రైతులు లాభదాయకమైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులకు విస్తృత డిమాండ్ ఏర్పడతుందని, దీంతో రైతులకు మరింత ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ రాళ్లపేట అప్పారావు, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ఎన్.ధనుంజయరావు, ఎఇఒ గొండు శ్రీధర్, ఎన్ఎఫ్ఎ గోవిందరెడ్డి, వైపి జతిన్, ఎంటి శోభన్‌బాబు, విఎఎ శశిభూషన్, అభ్యుదయ రైతులు తంగి రమణమూర్తి, శ్రీనివాస్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎం.టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అల్లు ధనుంజయ 0.50 విస్తీర్ణంలో వరి పంట వరుస క్రమ పద్ధతిలో నాటించటంపై అవగాహన కల్పించారు. అంతకు ముందు బీజామృతంతో నారు శుద్ధి చేసి చిగుళ్లు తుంచి వరుస క్రమ పద్ధతిలో నాటించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పిలు రమణమ్మ, మాధవి పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు పంపిణీకి సిద్ధం

నరసన్నపేట: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. శుక్రవారం దేవాదిలో నరసన్నపేట డివిజన్ పరిధిలో గల పోలాకి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాలో ప్రకృతి వ్యవసాయ రైతులకు వరి, కూరగాయ పంటలకు లింగాకర్షక బుట్టలు పెట్టుటకు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీతా రామయ్య, మేరీ లజపతిరావు, పాపారావు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఢిల్లీరావు మృతి కార్మికవర్గానికి తీరనిలోటు

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడుకు చెందిన ఢిల్లీరావు మృతి కార్మికవర్గానికి తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ఆనందరావు, ఎఐసిటియు నాయకులు బొడ్డు వాసుదేవరావు అన్నారు. శుక్రవారం బొడ్డపాడులో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి, సిఐటియు నాయకులుగా ఢిల్లీరావు పనిచేస్తూ ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కార్మిక ఉద్యమానికే కాకుండా, పలు శ్రామిక, ఉద్యమాల్లో పాల్గొని నవ సమాజ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి ఢిల్లీరావు అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వారితో పాటు పి.దానేసు, ప్రజా సంఘాల నాయకులు ఎన్. మోహన రావు, బి. రామకృష్ణ, చంద్రయ్య, అప్పయ్య, బచ్చల పాపారావు, బొడ్డు సింహాద్రి, వైకుంఠరావు తదితరులున్నారు.

నిలిపివేసిన పింఛన్లు సెప్టెంబర్‌లో పంపిణీ

ప్రజాశక్తి- నరసన్నపేట

ఇటీవల నిలుపుదల చేసిన పింఛనుదారులకు సెప్టెంబర్ నెలలో పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రువారం ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వికలాంగులకు ప్రభుత్వం ఇటీవల పొందిన సదరం సర్టిఫికెట్‌లో ఎవరికైతే అంగవైకల్యం 40 శాతం పైబడి ఉంటుందో వారికి యథాతథంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, వారికి సెప్టెంబర్ 1నుంచి పంపిణీ జరుగుతుందని తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంఇఒ తదితరులు

ఎమ్మెల్యేను కలిసిన ఎంఇఒ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ఇన్‌ఛార్జి ఎంఇఒ కె.అప్పలరాములు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. మండలంలోని విద్యాభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. హడ్కోకాలనీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగాళ్ల మురళీధర్ యాదవ్, సిఆర్‌ఎంటి దుప్పల పూడి శ్రీనివాసరావు, పివివికె రాజు పాల్గొన్నారు.

31లోగా పంటల బీమా చెల్లించాలి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పిఎసిఎస్‌లో పంట రుణాలు రెన్యువల్ చేసుకున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) ప్రీమియంను ఈ నెల 31లోగా చెల్లించాలని శుక్రవారం పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ తెలిపారు. పంట రుణాలు చెల్లించిన రైతులు ఒక ఎకరానికి పంటల భీమా నిమిత్తం రూ.160 ప్రీమియంను చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ప్రీమియంతో పాటు రైతు 1బి, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో పిఎసిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈయనతో పాటు పిఎసిఎస్ డైరెక్టర్లు దుంపల సత్యం, కింజరాపు వెంకట రమణ, సిఇఒ ఎర్నేన పాపినాయుడు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

శక్తి యాప్‌పై అవగాహన

నందిగాం: మండలంలోని దేవలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెక్కలి డివిజన్ శక్తి టీం శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్ ఉపయోగాలు, వినియోగం తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో టెక్కలి డివిజన్ శక్తి ఇన్‌ఛార్జి ఎం.గిరిధర్, టీం సభ్యులు జిఎంఎస్‌కె తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సోలో కచేరీ

కవిటి: మండలంలోని పెద్ద కపాసుకుద్దిలో భారతమాత అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వయోలిన్ శాస్త్రీయ సంగీత సోలో కచేరీ జడివానలో శ్రోతలు తడిసి ముద్దయ్యారు. కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాంసుడు, అంతర్జాతీయ కళాకారుడు, ఏ-టాప్ గ్రేడ్ ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్ మావుడూరు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంగీత కచేరీ ఆద్యంతం అలరించింది. ఈ కచేరీలో మావుడూరు వాయునందన శర్మ సహకార వయోలిన్ వాయించగా, మావుడూరు శ్రీనివాస శర్మ సహకార గాత్రం అందించారు. మావుడూరి సూర్య ప్రసాద్ శర్మ మృదంగం, చలపరాయి వినోద్ కుమార్ ఘటం, ఎం. కన్నరాజు కీబోర్డ్, ఎం.నరేష్ ప్యాడ్స్‌తో సహకారం అందించడంతో కచేరీ 'నభూతో నభవిష్యతి' అన్నట్టుగా సాగింది. అంతకుముందు గ్రామస్తులు ఆలయంలో భారతమాతకు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన నారాయణసేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కచేరీ నిర్వహిస్తున్న సత్యనారాయణ శర్మ

స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జెసిఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో విద్యార్థులకు జెసిసాట్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిఐ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ మాట్లాడుతూ విద్యార్థులను చదువులో ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన యువతను గుర్తించడానికి ఇలాంటి పరీక్షలను ప్రతిఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయ కర్తలు స్నిగ్ధ, శిరీష, సంతోష్ సాహు నిర్వహించారు. జోన్ అధికారులు షన్ముఖ్, స్వరూప్, సభ్యులు నవీన్, వెచ్చా వాసవి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు తెలపాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ఓటర్లు జాబితాలో తప్పులు ఏమైనా ఉంటే నిశితంగా పరిశీలించి తెలియజేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల అన్ని పార్టీలకు చెందిన నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఓటర్లు, జాబితాలో చేర్పులు, మార్పులు, అదేవిధంగా పోలింగ్ స్టేషన్ మార్పులు విషయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం క్లస్టర్ వర్కర్ టి.ఉషారాణి అన్నారు. మండలంలోని పొందూరు సిహెచ్‌సి, కింతలి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, సిఫీలిస్ వంటి వ్యాధులపై తెలియజేశారు. హెచ్ఐవి సంక్రమణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎం.సుజాత, బి.ప్రతిభ, ఐసిటిసి కౌన్సిలర్ నాగవల్లి, టిబి ఎస్‌టిఎస్ ల్యాబ్ టెక్నిషియన్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోసమాలలో పొలంబడి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కోసమాలలో ఇండి గాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం మండల ఎఒ ఎస్.దానకర్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో రైతులకు శాస్త్ర సాంకేతిక పద్ధతితో పాటు ఎరువులు, యాజమాన్యం, సేంద్రియ ఎరువుల వాడకం, పురుగు మందులు వినియోగంపై అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోగాల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతి, భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



ఇచ్ఛాపురం : రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు డాక్టర్లు పి.దేవేంద్ర రెడ్డి, డాక్టర్ అనూషా చేతులమీదుగా రోగులకు పండ్లు రొట్టెలు అందించారు. అక్కడ నుంచి బంగ్లా రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌లో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చిరు అభిమానులు అలీంఖాన్, దాసరి అజయ్, దట్టీ శ్రీను, పుణ్యవాసులు, అజ్జు, మోహన్, బావర్తీ రాజు, చందు, మున్నా, రఘు, భాస్కర్, ఆది, వాసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జనసేన కార్యాలయంలో కూడా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాసరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని పెద్దపాలెంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అఖిల భారత వ్యవస్థాపకులు రవణం స్వామి నాయుడు పర్యవేక్షణలో జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు బగ్గు అప్పలరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, తులగాపు ధనుంజయ్, బాలమురళి, మిరాల మిన్నారావు, సతివాడ రామకృష్ణ, సత్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో రుజువు చేసుకుని స్థలం వద్దకు రావాలి

ప్రజాశక్తి- పలాస



మాట్లాడుతున్న వెంకటరమణ

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని దంతం వీధిలో సర్వే నెం 230/7లో 9 మూరలు స్థలం తన తండ్రి కోట్ని సత్యన్నారాయణ వారసత్వంగా తనకు సంక్రమించిందని, ఈ స్థలం తనదంటూ తాళసు నాగేశ్వరరావు నకిలీ పత్రాలు సృష్టించి స్థలంలో పనులు చేయిస్తున్నారని ఈ స్థలంపై కోర్టులో రుజువు చేసుకొని తీర్పు ఆధారంగా స్థలంపైకి రావాలని, అలా కాకుండా దౌర్జన్యంగా తన స్థలంలో పనులు చేపట్టడం సరికాదని కోట్ని వెంకటరమణ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది మూర్లు స్థలం దమయంతమ్మ తనకు విక్రయించిందని, దానిని తన భార్య పేరున రిజిస్టర్ చేయించానని నాగేశ్వరరావు కోర్టుకు, అధికారులకు నమ్మబలుకుతున్నారన్నారు. ఈ స్థలం కోసం నాగేశ్వరరావుపై తాను సోంపేట కోర్టులో దావా వేయడం జరిగిందిని, వాటిపై వాదనలు కొనసాగు తున్నాయన్నారు. దీనిపై తాను ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందానని, ఇరువర్గాలు కోర్టు తీర్పు వెలువడిన వరకు స్థలంపైకి వెళ్లకూడదని హెచ్చరిందన్నారు. అయినప్పటికీ ఒక కాంట్రాక్టర్ ద్వారా నాగేశ్వరరావు స్థలంలో నిర్మాణాల కోసం పనులు చేయిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని తాను కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కోర్టు అయనకు అనుకూలంగా తీరు ఇచ్చినా, సరైన డాక్యుమెంట్‌లు చూపించినా స్థలం వదులు కోవడానికి తాను సిద్ధమేనన్నారు. అలా కాకుండా ఇలా దౌర్జన్యంగా పనులు చేపట్టడం సరికాదన్నారు.

వ్యక్తిత్వ హననం తగదు



ఎమ్మెల్యేకు సంఘీభావం తెలుపుతున్న జనార్ధనరావు తదితరులు

ప్రజాశక్తి- ఆముదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు నిరాధారమని విజయనగరం జిల్లా కాళింగ సంఘం అధ్యక్షుడు పేడాడ జనార్ధనరావు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ఎటువంటి ఆరోపణలు లేకుండా ప్రజాసేవ చేస్తున్న రవికుమార్ వ్యక్తిత్వం దెబ్బతినే విధంగా సౌమ్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. దీనిని ఖండిస్తున్నట్లు జనార్ధనరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా కాళింగ సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ కంచరాన మురళీధర్, జిల్లా సహాధ్యక్షుడు సనపల రమణారావు, సంయుక్త కార్యదర్శి సీపాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గం ఐటిడిపి కార్యదర్శిగా తామాడ భాస్కరరావును, పాతపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా సయ్యద్ జహీర్, పడాల శ్రీనులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఎంపిక చేశారు. వీరిని మండలంలోని పట్టుపురంలో టిడిపి నాయకులు శుక్రవారం ఘనంగా పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి పార్టీ అభివృద్ధికి పాటు



సన్మానిస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు మోహనరావు

పడాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర రెడ్డి, సలాన వెంకటరావు తదితరులున్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

ప్రజాశక్తి- కవిటి

పట్టణంలోని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శుక్రవారం ఉదయం 'మట్టి గణపతిని పూజిద్దాం - ప్రకృతిని రక్షిద్దాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంతోష్ మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించడం పర్యావరణానికి మేలు చేస్తుందని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిని కలుషితం చేయడంతో జలచరాలు నశించే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ హరిత సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపడుతున్నామని హరిత సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. శుక్రవారం వెంకటేశ్వర కాలనీ, వెంకటరావుపేటలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పిఒపి)తో తయారైన విగ్రహాలు నేల, నీరు, వాయు కాలుష్య కారకాలు కావడంతో, ఈ కార్యక్రమం ద్వారా సహజసిద్ధమైన మట్టితో తయారైన వినాయక విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందజేస్తూ అవగహన కలిగిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో హరిత సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, సభ్యులు గొర్లె అప్పలనాయుడు, ఆర్.భవాని, ఎం.అప్పలనాయుడు, ఆర్.దేవుడుబాబు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం తదితరులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అంకిత భావంతో పనిచేస్తే సమాజం గుర్తిస్తుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ మిశ్రా అన్నారు. శుక్రవారం నడసంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు వివిధ పాఠశాలలకు వెళ్లిపోవడం బాధాకరంగా ఉందన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందించి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలక్ష్మి, ధర్మారావు, సోయి నాగేశ్వర, సుజాత, అంజన, ఖుంటియా, శిశిరో, వినోదిని, విరాజిని, మమినా, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సెప్టెంబర్ 2న డిప్యూటీ సిఎం, పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రారంభం కానున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు శుక్రవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా సెప్టెంబర్ 2న ప్రారంభం కానున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను పొంది కంప్యూటర్ నైపుణ్యం సంపాదించుకోవాలని, ఈ శిక్షణ 45 రోజులు పాటు ఉంటుందన్నారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు, 18 ఏళ్లు నిండిన ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, కవిటి మండలాల యువతీ, యువకులు జనసేన కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రేమ్‌కుమార్ 9705710798, శ్యాంసుందర్ 9908909513 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో డైరీల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బెల్లుపడా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధి నిమిత్తం డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ బెల్లుపడా పాఠశాలలో ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తున్నారని, విద్యా ప్రమాణాల పెంపుదలకు వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. హెచ్‌ఎం స్వర్ణరేఖ, వైస్ చైర్మన్ భవాని మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది సహకారంతో వినూత్న బోధనా విధానాలు అవలంభిస్తూ పాఠశాల విద్యాభివృద్ధిలో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి కుమార్, ఆనంద్, దేవి, సిఆర్‌పి దేవరాజు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డైరీలను ప్రదర్శిస్తున్న ఎంఇఒ అప్పారావు